సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

శనివారం । 24 । జూన్ । 2023



సర్వం సిద్ధం..

ఆరు నెలలగా వాయిదా పడుతున్న టీఎస్ జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు పర్యటన ఎట్టకేలకు ఖరారైంది. 10లో



లాభాల బాటన డీసీసీబీ

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు లాభాల బాటలో పురోగమిస్తోందని చైర్మన్ కూరాకుల నాగభూషణం తెలిపారు. 12లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 29° / 25°

జిల్లాలో శనివారం వాతావరణం చల్లగా ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

స్వర్ణకవచధారణలో రామయ్య



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామివారి అంతరాలయంలో మూలమూర్తులు స్వర్ణ కవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. శుక్రవారం సందర్భంగా శ్రీ లక్ష్మీ తాయారు అమ్మవారి ఆలయంలో అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శ్రీకనకదుర్గమ్మతల్లికి పంచామృతాభిషేకం



అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: శ్రీకనకదుర్గమ్మ తల్లికి అర్చకులు శుక్రవారం వైభవంగా పంచామృతాభిషేకం జరిపారు. ముందుగా మేళతాళాలతో అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూల విరాట్‌కు పంచామృతంతో అభిషేకం నిర్వహించారు. ఆ తర్వాత పంచహారతులు, నివేదన, నీరాజన మంత్రపుష్పం పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, సభ్యులు పాల్గొన్నారు.

3న చండీహోమం

పెద్దమ్మతల్లి ఆలయంలో వచ్చే నెల 3న పౌర్ణమి సందర్భంగా చండీహోమ పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ ఎస్.రజనీకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హోమపూజలో పాల్గొనే భక్తులు రూ.2,516 చెల్లించి గోత్రనామాలను నమోదు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 98669 23261, 63034 08458 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కలెక్టరేట్ మారినా బోర్డును మార్చలేదు!



ఈవీఎం గోదాం వద్ద బోర్డు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌ను పాల్వంచ రోడ్‌లో కొత్తగా నిర్మించిన ఐడీఓసీ భవనంలోకి మార్చినా బోర్డు మాత్రం మార్చలేదు. పాత కలెక్టరేట్ ప్రధాన ద్వారం వద్ద కొత్తగూడెం ఆర్డీఓ కార్యాలయంగా పేరు మార్చి బోర్డు ఏర్పాటు చేశారు. కానీ పక్కనే ఉన్న ఈవీఎం గోదాం వద్ద మాత్రం ఇంకా కలెక్టర్ కార్యాలయం బోర్డును తొలగించలేదు. ఆ బోర్డు పక్కనుంచి లోపలికి ఉన్న దారిలో వెళితే ఈవీఎం గోదాం, కొత్తగూడెం ఫారెస్ట్ కార్యాలయం ఉంటాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆ బోర్డును మార్చాలని పలువురు కోరుతున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్

భద్రాచలంఅర్బన్: నిషేధిత వస్తువులు రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. శుక్రవారం భద్రాచలం బ్రిడ్జి సెంటర్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రాచలం మీదుగా గంజాయి అక్రమంగా రవాణా జరుగుతోందని, దీనిని దృష్టిలో పెట్టుకుని నిత్యం వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లల అలవాట్లపై దృష్టి పెట్టాలని, యువత చెడు వ్యసనాల బారిన పడకుండా చూడాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దని పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో ఏఎస్పీ కార్యాలయ సిబ్బంది వినోద్, ఇమామ్, టౌన్ పోలీసులు, సీఆర్పీఎఫ్ జవాన్లు పాల్గొన్నారు. కాగా ట్రాఫిక్ ఎస్‌ఐ పీవీఎన్ రావు, తదితరులు పట్టణంలోని పలు కూడళ్లలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు.

'గుర్తింపు' మళ్లీ వాయిదా

- అక్టోబర్‌కు వాయిదా వేస్తూ తీర్పు ఇచ్చిన రాష్ట్ర హైకోర్టు
- సాధ్యాసాధ్యాలు పరిగణనలోకి తీసుకోవాలని కోరిన యాజమాన్యం
- ఉద్దేశపూర్వకంగానే వ్యవహరిస్తోందంటున్న కార్మిక సంఘాలు
- సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు 'అసెంబ్లీ' తర్వాతే..?



కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం

సింగరేణి(కొత్తగూడెం): కొంతకాలంగా ఊరిస్తున్న సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు మళ్లీ వాయిదా పడ్డాయి. ఎన్నికల ప్రక్రియను వచ్చే అక్టోబర్‌కు వాయిదా వేస్తూ తెలంగాణ రాష్ట్ర హైకోర్టు శుక్రవారం కీలక తీర్పు వెల్లడించింది. దీంతో గుర్తింపు సంఘం ఎన్నికలపై నేడు హైదరాబాద్‌లో డిప్యూటీ లేబర్ కమిషనర్ ఆధ్వర్యంలో జరిగే సమావేశానికి ప్రాధాన్యత లేకుండా పోయింది. గుర్తింపు సంఘం ఎన్నికల నిర్వహణపై యాజమాన్యం, కార్మిక సంఘాల మధ్య భేదాభిప్రాయాలు తలెత్తాయి. ఉద్దేశపూర్వకంగానే యాజమాన్యం ఎన్నికలు వాయిదా వేస్తోందని కార్మిక సంఘాలు పేర్కొంటుండగా, మరోవైపు ఉత్పత్తిపై ప్రభావం పడుతోందని సింగరేణి చెబుతోంది. ఈ నేపథ్యంలో ఇరువర్గాలు రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించాయి. శుక్రవారం ఇరుపక్షాల వాదోపవాదాలు విన్న న్యాయస్థానం యాజమాన్యం అభ్యంతరాలు, ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని గుర్తింపు సంఘం ఎన్నికల పనులను 2023, అక్టోబర్ 1న నిర్ణయించుకునేందుకు అవకాశం ఇస్తూ తీర్పు వెలువరించింది.

2021 నుంచి వాయిదాలు..

చివరిసారిగా సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు 2017, అక్టోబరు 5న జరిగాయి. ఆ ఎన్నికల్లో టీజీబీకేఎస్ గెలుపొందింది. ఈ సంఘం గుర్తింపు కాలపరిమితి 2021 అక్టోబరు 5తో ముగిసింది. అప్పటి నుంచి గుర్తింపు ఎన్నికల నిర్వహణ వాయిదా పడుతోంది. ఈ నేపథ్యంలో ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ హైకోర్టును ఆశ్రయించింది. విచారణ జరిపిన న్యాయస్థానం తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని 2022, డిసెంబరు చివరి వారంలో తీర్పు ఇచ్చింది. జనవరి నుంచి మార్చి వరకు ఎన్నికల ప్రక్రియ మొదలెడితే ఉత్పత్తిపై ప్రభావం ఉందని సింగరేణి చెప్పడంతో ఈ ప్రక్రియ మొత్తం 2023, జూన్ 1కి వాయిదా పడింది.

మ్యాన్ పవర్ సర్దుబాటు చేయడం కష్టమంటూ కలెక్టర్ల లేఖలు

హైకోర్టు ఆదేశాలను అనుసరిస్తూ గుర్తింపు సంఘం ఎన్నికల ప్రక్రియను డిప్యూటీ లేబర్ కమిషనర్ ప్రారంభించారు. ఈ మేరకు సింగరేణిలో యాక్టివ్‌గా ఉన్న సంఘాలతో ఈ నెల 13 సమావేశం నిర్వహించారు. తదుపరి సమావేశాన్ని 24న జరపాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో ఎన్నికల షెడ్యూల్ వివరాలు ప్రకటిస్తారని అంతా భావించారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు నిర్వహించడంతో సాధ్యాసాధ్యాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరుతూ సింగరేణి యాజమాన్యం న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. మరోవైపు ఎన్నికల నిర్వహణకు మ్యాన్ పవర్ సర్దుబాటు చేయడం కష్టమంటూ కేంద్ర కార్మిక శాఖకు సింగరేణి విస్తరించిన జిల్లాల కలెక్టర్లు లేఖలు ఇచ్చారు. దీంతో ఎన్నికల నిర్వహణపై ఉత్కంఠ నెలకొంది. కాగా శుక్రవారం హైకోర్టు ఎన్నికల నిర్వహణకు నాలుగు మాసాల గడువు ఇస్తూ తీర్పు చెప్పడంతో ఉత్కంఠకు తెర పడింది.

2017 గుర్తింపు ఎన్నికల ఫలితాలు ఇలా...

సంఘం	ఓట్లు	గెలిచిన ఏరియాలు
టీజీబీకేఎస్	23,311	భూపాలపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్, కొత్తగూడెం, రామగుండం–3
ఏఐటీయూసీ	16,724	ఇల్లెందు, బెల్లంపల్లి
ఐఎన్‌టీయూసీ	12,077	కొత్తగూడెం కార్పొరేట్, మణుగూరు
హెచ్‌ఎంఎస్	5,983	రామగుండం–2, రామగుండం–1
ఇతరులు	2,152	

ఇక శాసనసభ ఎన్నికల తర్వాతే..!

హైకోర్టు తాజా నిర్ణయంతో 2023 వరకు అక్టోబరు వరకు ఎన్నికలు జరగవనేది స్పష్టమయింది. మరోవైపు తెలంగాణ అసెంబ్లీ సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ కూడా అక్టోబరులో వెలువడే అవకాశం ఉంది. దీంతో సాధారణ ఎన్నికల కారణంగా మరోసారి గుర్తింపు ఎన్నికలు వాయిదాపడటం ఖాయమనే అభిప్రాయం కార్మిక సంఘాల్లో వ్యక్తమవుతోంది. ఓటమి భయంతోనే రాష్ట్ర ప్రభుత్వం యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చి ఎన్నికలు వాయిదా వేస్తోందని కార్మిక నాయకులు ఆరోపిస్తున్నారు.

కాగా గుర్తింపు సంఘం ఎన్నికల కాల పరిమితి నాలుగేళ్లకు పెంచాలని కోరుతూ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ నాయకులు ఆంతోటి నాగేశ్వరరావు, కనుగుల తిరుపతి, జిమ్మిడి మల్లేష్, కారుకూరు లక్ష్మణ్ తదితరులు డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్‌కు శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు.

అన్ని యూనియన్లకు సమాన హోదా కల్పించాలి



కంచే చేను మేసిన చందంలా ఉంది. ప్రభుత్వం ఒకవైపు ఎన్నికలకు పోతామంటూనే మరోవైపు టీబీజీకేఎస్‌తో ఒక పిటిషన్, సింగరేణి మేనేజ్‌మెంట్‌తో మరో పిటిషన్ వేయించింది. సింగరేణిలో ఎన్నికలు నిర్వహిస్తే వాటి ప్రభావం అసెంబ్లీ ఎన్నికలపై పడుతుందని భయపడుతోంది. ఈ పరిస్థితుల నేపథ్యంలో సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు లేకుండా కోడ్ ఆఫ్ డిసిప్లేన్ రద్దు చేసి, అన్ని యూనియన్లకు సమాన హోదా కల్పిస్తే సరి.

–వాసిరెడ్డి సీతారామయ్య, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి

కాంగిరేస్‌లో... హైరానా!

- 'హస్తం' టికెట్ కోసం ఉమ్మడి జిల్లా నేతల పరుగులు
- ఇప్పటికే అధిష్టానాన్ని కలిసిన ఆశావహులు
- రేణుకాచౌదరి, భట్టి వర్గీయుల్లో ఎవరికి వారే టికెట్‌పై ధీమా
- పొంగులేటి చేరనుండడంతో మరింత పెరగనున్న పోటీ



సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీలో టికెట్ల కోసం వేట మొదలైంది. అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా ఐదారు నెలల సమయం ఉన్నా ఆలోపు ఏం జరగనుందోనన్న ఆందోళన ఆశావహుల్లో కనిపిస్తోంది. జిల్లాలోని మెజార్టీ నియోజకవర్గాల్లో ముగ్గురు నుంచి నలుగురు పార్టీ టికెట్ ఆశిస్తున్నారు. సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క, మాజీ కేంద్ర మంత్రి రేణుకాచౌదరి అనుచర వర్గాలు తమకే టికెట్లు వస్తాయన్న ధీమాతో ఉన్నారు. ఇంతలోనే మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్‌లో చేరిక ఖరారైంది. అయితే, ఆయన పార్టీలో చేరకముందే కొన్ని నియోజకవర్గాలకు తన తరఫున అభ్యర్థులను ప్రకటించడంతో ఆశావహుల్లో కంగారు మొదలైంది.

నియోజకవర్గాల వారీగా ఇలా...

- **కొత్తగూడెం** అసెంబ్లీ సీటు జనరల్ కావడంతో ఆశావహుల సంఖ్య ఎక్కువగానే ఉంది. కొన్నేళ్లుగా పట్టు వదలకుండా రేణుకా చౌదరి వర్గానికి చెందిన ఎడవల్లి కృష్ణ ఎన్నికల బరిలో నిలిచేందుకు విశ్వప్రయత్నాలు చేస్తుండగా, ఈసారి ఎలాగైనా టికెట్ దక్కించుకోవాలని పట్టుదలతో ఉన్నారు. అలాగే, భట్టి వర్గానికి చెందిన నాగ సీతారాములు కూడా టికెట్ వేటలో ఉన్నారు. ఇంకా అలాగే భట్టి అనుచర నేత పోట్ల నాగేశ్వరరావు కొత్తగూడెంలో క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేయడమే కాక ఎన్నికల్లో పోటీకి సిద్ధమవుతున్నారు. వీరు కాకుండా మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తాను మూడు నియోజకవర్గాల్లో ఒకటి ఎంచుకుంటానని చెప్పడంతో జాబితాలో ఖమ్మం లేదా కొత్తగూడెం ఉండొచ్చనే ప్రచారం సాగుతోంది.
- **భద్రాచలం** నుంచి కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న పొదెం వీరయ్య డీసీసీ అధ్యక్షుడిగానూ కొనసాగుతున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలకు మొదటి ప్రాధాన్యతగా టికెట్లు ఇవ్వనుండడంతో ఆయనకే టికెట్ ఖాయమని సమాచారం. అయితే ఈ స్థానంపై పొంగులేటి ప్రధాన అనుచరుడైన తెల్లం వెంకట్రావు ఆశలు పెట్టుకున్నారు. 2014 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ, 2018లో టీఆర్ఎస్ నుంచి ఆయన పోటీ చేశారు.
- **ఇల్లెందు** నియోజవర్గంలో టికెట్లు ఆశిస్తున్న వారి సంఖ్య ఎక్కువగానే ఉంది. ఇక్కడ చీమల వెంకటేశ్వర్లు, భూక్యా దళ్‌సింగ్‌నాయక్, డాక్టర్ రాంచందర్‌నాయక్, డాక్టర్ జి.రవి, బానోతు విజయలక్ష్మి, కామేపల్లి జెడ్పీటీసీ వెంకటప్రవీణ్‌నాయక్ టికెట్ రేసులో ఉన్నారు. వీరిలో ఇద్దరు నేతలు భట్టి వర్గం వారు కాగా, మిగతా నేతలు ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రేణుకాచౌదరి, రాంరెడ్డి దామోదర్‌రెడ్డి వర్గాలకు చెందినవారు. వీరిలో చీమల వెంకటేశ్వర్లు ఇటీవల టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రేను కలిశారు. ఇక జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య పొంగులేటి వర్గం నుంచి టికెట్ ఆశిస్తుండగా, ఆయన అభ్యర్థిత్వాన్ని పొంగులేటి కూడా ప్రకటించారు.
- **అశ్వారావుపేట**కు సంబంధించి 2018లో టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన తాటి వెంకటేశ్వర్లు ఇటీవల కాంగ్రెస్ గూటికి చేరారు. ఆ స్థానం టికెట్ తనదేనన్న ధీమాతో ఆయన ఉన్నారు. అయితే పొంగులేటి తన వర్గం అభ్యర్థిగా జారె ఆదినారాయణను ప్రకటించడంతో టికెట్ ఎవరికనే చర్చ జరుగుతోంది.
- **పినపాక** నియోజకవర్గంలో పాయం వెంకటేశ్వర్లు అధికార పార్టీకి దీటైన అభ్యర్థి అని ఆ పార్టీ నేతలు చర్చించుకుంటున్నారు.

ఖమ్మం జిల్లాలో..

వైరా నియోజకవర్గంలో కేంద్రమాజీ మంత్రి రేణుకాచౌదరి వర్గం నుంచి ధరావత్ రామ్మూర్తినాయక్, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క వర్గం నుంచి మాలోతు రాందాస్‌నాయక్, బానోత్ బాలాజీనాయక్ టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే క్యాంపు కార్యాలయాలు ఏర్పాటు చేసుకుని వేర్వేరుగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అలాగే, ఇక్కడ పొంగులేటి వర్గం నుంచి అభ్యర్థిగా బానోతు విజయాబాయిని ప్రకటించడంతో టికెట్ కోసం బహుముఖ పోటీ నెలకొంది. మధిరలో పొంగులేటి వర్గం నుంచి కోటా రాంబాబు టికెట్ ఆశిస్తున్నా.. సీఎల్పీ నేత, సిట్టింగ్ ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్కనే బరిలో ఉండనున్నారు. సత్తుపల్లిలో మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, కోటూరి మానవతారాయ్, మట్టా దయానంద్ టికెట్ కోసం పోటీ పడుతున్నారు. ఈ నియోజకవర్గానికి సంబంధించి కొండూరి సుధాకర్‌ను పొంగులేటి తన అభ్యర్థిగా చెబుతున్నారు. పాలేరులో రాయల నాగేశ్వరరావు, రామసహాయం మాధవీరెడ్డి, మద్ది శ్రీనివాస్‌రెడ్డితోపాటు పొంగులేటి వర్గం నుంచి మద్దినేని బేబి స్వర్ణకుమారి టికెట్ ఆశిస్తున్నారు. ఖమ్మంలో రేణుకా చౌదరి, భట్టి అనుచరులు ఒకరిద్దరు టికెట్‌పై ఆశలు పెట్టుకున్నారు. మరోవైపు ఈ స్థానం నుంచి పొంగులేటి కూడా పోటీలో ఉంటారన్న ప్రచారం మొదలైంది.

ఉత్సాహంగా ఒలింపిక్ డే రన్..




పరుగు తీస్తున్న డీఎస్పీ రెహమాన్ తదితరులు

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెంలో శుక్రవారం నిర్వహించిన ఒలింపిక్ డే రన్ ఉత్సాహంగా సాగింది. జిల్లా యువజన క్రీడలు, రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం ఈ కార్యక్రమం నిర్వహించారు. 8 గంటలకు ప్రకాశం స్టేడియంలో ప్రారంభమైన రన్ రైల్వే స్టేషన్‌వరకు చేరుకుంది. కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, యువజన క్రీడల శాఖ అధికారి టీ.సీతారాం, రాష్ట్ర ఒలింపిక్ డే రన్ కన్వీనర్ పుట్టా శంకరయ్య తదితరులు జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వందలాది మంది క్రీడాకారులు ఉత్సాహంగా రన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ జిల్లాకు చెందిన క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో పేరు ప్రఖ్యాతులు సంపాదించారని గుర్తుచేశారు. రానున్న రోజుల్లో మరింతగా రాణించాలని, తాము అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. సీఎం కప్‌లో రాష్ట్ర స్థాయిలో మనోళ్లు ఏడు పతకాలు సాధించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, క్రీడా సంఘాల బాధ్యులు ఉదయ్‌కుమార్, తిరుమలరావు, లక్ష్మయ్య, కృష్ణారావు, ఉదయ్, కాశీహుస్సేన్, జాన్సన్, ఇమామ్, శ్రీధర్, మొగిలి, స్వాతిముత్యం, హనుమంత్‌రాజ్, కె.మహీధర్, రాజేంద్రప్రసాద్, యుగంధర్‌రెడ్డి, గుమలాపురం సత్యనారాయణ, స్టెల్లా తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన వర్కర్ల 36 గంటల దీక్ష

గురువారం రాత్రి కలెక్టరేట్ వద్ద నిరసన



రాత్రి వేళ నిరసన శిబిరంలో మధ్యాహ్న భోజన వర్కర్లు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సమస్యల పరిష్కారం కోసం మధ్యాహ్న భోజన వర్కర్లు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో 36 గంటల నిరసన దీక్ష చేపట్టారు. గురువారం రాత్రి కలెక్టరేట్ వద్దే జాగారం చేశారు. గురువారం ప్రారంభమైన దీక్ష శుక్రవారం సాయంత్రం ముగిసింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన బిల్లులు చెల్లించేవరకూ పాఠశాలల్లో వంటలు బంద్ చేస్తున్నట్లు ప్రకటించారు. ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన విధంగా వేతనాన్ని పెంచాలని, కేరళ రాష్ట్రంలో మాదిరిగా రోజుకు రూ.600 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం నిరసన శిబిరం వద్దే డీఈఓ సోమశేఖరశర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ బిల్లుల సమస్య కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మిడ్డే మీల్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎస్.విజయలక్ష్మి, మున్నా లక్ష్మీకుమారి, ఆర్.లక్ష్మీనారాయణ, నరసింహారావు, దాసుల పుష్ప, మంగ, పద్మ పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ పరిధిలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో, అర్బన్ రెసిడెన్షియల్ స్కూళ్లలో స్పెషల్ ఆఫీసర్, పీజీసీఆర్‌టీ, సీఆర్‌టీ, పీఈటీ పోస్టుల భర్తీకి అర్హులు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ ఇ.సోమశేఖరశర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమగ్ర నోటిఫికేషన్ పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు పేర్కొన్నారు. ఈ నెల 26 నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు దరఖాస్తు గడువు ఉందని తెలిపారు. జిల్లాలో మొత్తం 69 ఖాళీలు ఉన్నాయని, స్పెషల్ ఆఫీసర్–1, సీఆర్టీ–15, పీఈటీ–1, పీజీసీఆర్‌టీ–52 ఉన్నాయని, మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులని వివరించారు.

ఇన్‌చార్జ్‌లతో నెట్టుకొస్తున్నారు..!

- ఐటీడీఏలో కీలక పోస్టులన్నీ అదనపు బాధ్యతలతోనే..
- సెక్టోరియల్ పోస్టులు సైతం ఉపాధ్యాయులతో డిప్యూటేషన్
- అభివృద్ధి, సంక్షేమం, విద్యారంగాలపై తీవ్ర ప్రభావం
- ఐటీడీఏపై ప్రభుత్వానికి వివక్ష తగదంటున్న గిరిజన సంఘాలు



భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయం

భద్రాచలం: గిరిజనాభివృద్ధికి కీలకమైన భద్రాచలం ఐటీడీఏలో కీలక పోస్టులన్నీ ఇన్‌చార్జ్‌లతోనే నడుస్తున్నాయి. దీంతో గిరిజనులకు సంక్షేమ పథకాలు సకాలంలో అందటం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు అధికారులు కూడా అదనపు బాధ్యతలతో ఒత్తిడికి గురవుతున్నారు. పీఓ అనంతరం కీలకమైన ఏపీఓ జనరల్‌గా డేవిడ్ రాజ్ విధులు నిర్వర్తిస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్సీఓగానూ అదనపు బాధ్యతలు చూస్తున్నారు. ఇటీవల ఆశ్రమ పాఠశాలలో జరిగిన అక్రమ డిప్యూటేషన్లపై విచారణ అనంతరం గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్(డీడీ)గా పనిచేస్తున్న రమాదేవిని బదిలీ చేశారు. దీంతో డీడీ బాధ్యతలు కూడా ఆయనకే అప్పగించారు. సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న ఆదినారాయణ ఐటీడీఏ ఇన్‌చార్జ్ మేనేజర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వైద్య శాఖలో అదనపు డీఎంహెచ్‌ఓ బాధ్యతలను డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీషకు అప్పగించారు. స్టాటిస్టికల్ అధికారి సురేష్‌బాబు కొండరెడ్ల పర్యవేక్షణ ప్రత్యేక అధికారిగా, ఎన్ఆర్‌జీఎస్ యూనిట్ అధికారిగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇక స్పోర్ట్స్ అధికారి పోస్టు ఖాళీగా ఉంది. గిరి వికాసం, ఇతర గిరిజన సంక్షేమ పథకాలు సులభంగా అందించేలా ఉండే ఏపీఓ పవర్ పోస్టులో ఏడీఈ స్థాయి అధికారి పనిచేయాలి. కానీ ఏఈ స్థాయి అధికారితో నెట్టుకొస్తున్నారు. వ్యవసాయ శాఖలో డిప్యూటీ అకౌంట్స్ అధికారి భాస్కర్ అగ్రికల్చర్ ఏడీగా ఉండగా, ఉద్యానవన, మత్స్యశాఖ డెవలప్‌మెంట్ అధికారిగా విద్యాశాఖకు చెందిన అసిస్టెంట్ ట్రైబల్ డెవలప్‌మెంట్ అధికారి అశోక్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

సెక్టోరియల్ పోస్టుల్లోనూ...

సెక్టోరియల్ స్థాయి పోస్టులను సైతం డిప్యూటేషన్లతోనే నడిపిస్తున్నారు. పీఎంఆర్‌సీ విభాగంలో కీలకంగా భావించే అకడమిక్ కమ్యూనికేషన్ అండ్ మొబిలైజేషన్ అధికారి రమణయ్యకు పీఈటీసీ బాధ్యతలను అదనంగా అప్పగించారు. ఇదే విభాగంలో జీసీడీఓగా అలివేలు మంగతాయారు డిప్యూటేషన్‌పై ఉన్నారు. గిరిజన యువతకు ఉపాధి మార్గం చూపించే యువజన శిక్షణా కేంద్రానికి ఔట్ సోర్సింగ్ ఉద్యోగి, జాబ్స్ జిల్లా అధికారి హరికృష్ణ బాధ్యతలు నిర్వరిస్తున్నారు. గిరిజన సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించేలా ఏర్పాటు చేసిన ట్రైబల్ మ్యూజియానికి అధికారిగా వీరస్వామిని డిప్యూటేషన్‌పై నియమించారు. ఇతనే ట్రైబల్ కళాశాలకు సైతం ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. ట్రైబల్ వెల్ఫేర్ శాఖలో కీలకంగా భావించే డీడీ కార్యాలయంలో ఏళ్ల తరబడి డిప్యూటేషన్లపై పాతుకుపోవడం గమనార్హం. జూనియర్, సీనియర్ అసిస్టెంట్లుగా ఇదే కార్యాలయంలో ఓ ఉద్యోగి డిప్యూటేషన్‌పై 15 సంవత్సరాలుగా, ఏటీడీఓ కార్యాలయంలో 20 సంవత్సరాలుగా డిప్యూటేషన్‌పై పనిచేస్తుండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఉన్నతాధికారులను మచ్చిక చేసుకుంటూ, వారిని ఆర్థికంగా ప్రలోభపెడుతూ ఏళ్ల తరబడి తిష్ట వేస్తున్నారని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఆశ్రమ పాఠశాలల్లో విద్యాబోధన చేయాల్సిన వీరు డిప్యూటేషన్‌పై కార్యాలయాల్లో పనిచేస్తుండటంతో గిరిజన విద్య సైతం కుంటుపడుతోందని నాయకులు విమర్శిస్తున్నారు.

పాఠశాలలపై కొరవడుతున్న పర్యవేక్షణ

విద్యా సంవత్సరం ప్రారంభమైంది. ఐటీడీఏలో ఇటు గురుకులం, అటు ఆశ్రమ పాఠశాలలో అడ్మిషన్ల ప్రక్రియ నుంచి పాఠశాలలు ప్రారంభం, నిర్వహణ, హాస్టళ్లకు ఆహార వస్తువుల సరఫరాకు టెండర్ల నిర్వహణ, ఉపాధ్యాయుల, అధ్యాపకుల పోస్టుల భర్తీ, సీఆర్‌టీలు, డిప్యూటేషన్ల నిర్వహణ వంటి కీలక పనులు ఉంటాయి. వీటిని నిరంతరం సమీక్షిస్తూ, పర్యవేక్షిస్తూ ప్రిన్సిపాల్స్‌ను, ప్రధానోపాధ్యాయులను మానిటరింగ్ చేస్తూ గిరిజన బిడ్డలకు ఉత్తమ విద్యను అందించేందుకు కృషి చేయాలి. ఇటువంటి తరుణంలో ఒకే అధికారికి ఈ కీలక బాధ్యతలను అదనంగా అప్పగించటంతో అదనపు భారంగా భావిస్తున్నారు. ఒక్కరిపైనే కీలక పోస్టుల భారం మోపటంతో పర్యవేక్షణలోపంతో కిందిస్థాయి సిబ్బందిలో అవినీతి ఆరోపణలు గుప్పుమంటున్నాయి. భద్రాచలం ఏజెన్సీలో వర్షాకాలం సీజన్‌లో విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉంటుంది. గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించడం, ముందస్తు నివారణ చర్యలు చేపట్టడం, పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బందిపై నిరంతర పర్యవేక్షణ తదితర బాధ్యతలు చూడాల్సిన అదనపు డీఎంహెచ్‌ఓ పోస్టును జిల్లా వైద్యాశాఖాధికారి డాక్టర్ శిరీషకు అప్పగించారు. దీంతో వారు పూర్తిస్థాయిలో దృష్టి సారించలేకపోతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇలా కీలకమైన పోస్టులన్నీ ఇన్‌చార్జ్‌లతో నెట్టుకొస్తుండటంతో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై పర్యవేక్షణ కొరవడుతోంది. దీంతో కాలయాపన కూడా జరుగుతోంది. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులను డిప్యూటేషన్లపై కార్యాలయాల్లో నియమిస్తుండటం ఆ ప్రభావం విద్యార్థుల ఫలితాలపై పడుతోంది. బోధనేతర పోస్టుల్లో బోధన సిబ్బందిని పనిచేయించడం తగదని ఉపాధ్యాయ, గిరిజన సంఘాలు పేర్కొంటున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇన్‌చార్జ్ పాలనకు స్వస్తి పలికి రెగ్యులర్ అధికారులను నియమించాలని కోరుతున్నాయి.

క్లుప్తంగా

ముగ్గురు సీఐలకు డీఎస్పీలుగా పదోన్నతి

కొత్తగూడెంటౌన్: రాష్ట్రవ్యాప్తంగా పలువురు సీఐలకు డీఎస్పీలుగా పదోన్నతి కల్పిస్తూ డీజీపీ కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. హైదరాబాద్, వరంగల్ రేంజ్‌ల పరిధిలో జరిగిన బదిలీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన కొత్తగూడెం షీటీం సీఐ సీహెచ్ వెంకటేశ్వర్లు, కొత్తగూడెం పీసీఆర్ విభాగంలో సీఐగా పనిచేస్తున్న శ్రీనివాసులు, ఇంటిలిజెన్స్ విభాగంలో పనిచేస్తున్న యు.వెం కన్నబాబుకు పదోన్నతులు లభించాయి.

గంజాయి స్వాధీనం

నలుగురు వ్యక్తులు అరెస్టు



నిందితులు, గంజాయిని చూపిస్తున్న ఎక్సైజ్ అధికారులు

ఇల్లెందు: నలుగురు యువకులు కలిసి రెండు స్కూటీల్లో గంజాయిని తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎక్సైజ్ అధికారులు వారిని పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి.. వరంగల్, నర్సంపేటకు చెందిన రాజు, సోది, విపిన్‌కుమార్, వినయ్ రెండు స్కూటీల్లో సుమారు 18 కిలోల గంజాయిని ప్యాక్ చేసుకుని ఛత్తీస్‌గఢ్ నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. ఎక్సైజ్ అధికారులు పట్టణంలోని కరెంట్ ఆఫీస్ వద్ద కాపుకాసి వారిని పట్టుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.1.80 లక్షల విలువ ఉంటుందని జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కరమ్‌చంద్ తెలిపారు. తనిఖీల్లో ఇల్లెందు సీఐ రాజశేఖర్‌రావు, ఎస్‌ఐలు గౌతమ్, గోవర్ధన్, షమీఉల్లాఖాన్, హెడ్‌కానిస్టేబుళ్లు రవిబాబు, బాబా, పాషా, హబీబ్‌పాషా, తుల్సీరాం, సుమంత్ ఖన్నా పాల్గొన్నారు.

కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో 41 కేజీలు..

మధిర: భువనేశ్వర్ నుంచి ముంబై వెళ్తున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో మధిర ఎక్సైజ్, రైల్వే పోలీసులు శుక్రవారం సంయుక్త తనిఖీలు చేపట్టగా ఎండు గంజాయి లభించింది. మధిర స్టేషన్‌కు వచ్చిన రైలులో తనిఖీలు చేపట్టగా నాలుగు బ్యాగుల్లో తీసుకెళ్తున్న 41 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ కె.నాగేశ్వరరావు తెలిపారు. రూ.2లక్షల విలువైన గంజాయి లభించినా తరలిస్తున్న వారి ఆచూకీ లభించలేదని చెప్పారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్సైలు చంద్రశేఖర్, శార్వాణి, ఉద్యోగులు రజాలీ, గోపయ్య, రియాజ్, ముస్తఫా, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

యూపీ, ఢిల్లీ వాసుల నుంచి..

ఖమ్మంక్రైం: యూపీ, ఢిల్లీకి చెందిన ముగ్గురిని ఖమ్మం ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకుని 31 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో గంజాయి కొనుగోలు చేసిన యూపీలోని ఒడౌన్ జిల్లా మోహల్ల మల్యాన్ గ్రామానికి చెందిన రషీద్, షేక్ అబ్దుల్లా, నార్త్ ఈస్ట్ ఢిల్లీ గర్హన్ మండుకు చెందిన మహ్మద్ యాసిన్ హైదరాబాద్ మీదుగా ఢిల్లీ వెళ్లడానికి ఖమ్మం కొత్త బస్టాండ్‌కు వచ్చారు. అప్పటికే ఎక్సైజ్ స్టేషన్-1 సీఐ రాజు ఆధ్వర్యాన సిబ్బంది తనిఖీ చేస్తుండగా వీరు పట్టుబడ్డారు. సుక్మాలో కేజీ రూ.3వేల చొప్పున కొనుగోలు చేసి గంజాయిని ఢిల్లీలో రూ.20వేల చొప్పున అమ్మేందుకు వెళ్తున్నట్లుగా గుర్తించారు. తనిఖీల్లో ఏఈఎస్‌లు వేణుగోపాల్‌రెడ్డి, తిరుపతి, సీఐలు సర్వేశ్వరరావు, ఎస్సైలు అప్పారావు, రవి, రబ్బానీ, లత పాల్గొన్నారు.

కొత్తకారాయిగూడెంలో విషాదం

- దంపతులు సహా కుమార్తె ఆత్మహత్య

పెనుబల్లి: మండలంలోని కొత్త కారాయిగూడెంలో భార్యాభర్తలతో పాటు కూతురు ఆత్మహత్య చేసుకోగా ఆ కుటుంబంలో వారి కుమారుడు మాత్రమే మిగిలాడు. సొంతగా లారీ నడుపుతూనే వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్న పోట్రు వెంకటకృష్ణారావు(40) భార్య సుహాసిని(35)కి కేన్సర్ సోకినట్లు ఇటీవల తేలింది. చికిత్స చేయించే స్తోమత ఉన్నప్పటికీ ఆమె బతకదేమోననే భయంతో వెంకటకృష్ణారావు తన భార్యతో సహా ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. అయితే, వీరి కుమారుడు బీటెక్ చదువుతుండగానే బెంగళూరులోని హెచ్‌సీఎస్ ట్రెయినీగా ఉద్యోగం లభించింది. కానీ కుమార్తె అమృత(16) ఇటీవల ఇంటర్ పూర్తి చేసి బీటెక్‌లో చేరేందుకు సిద్ధమవుతోంది. ఈక్రమాన తామిద్దరం ఆత్మహత్య చేసుకుంటే కుమార్తె పరిస్థితి ఏమవుతుందోనన్న బెంగతో ఆమెను ఆత్మహత్యకు ప్రోత్సహించినట్లు తెలుస్తోంది. దీంతో గురువారం సాయంత్రం ఆస్పత్రికి వెళ్తున్నట్లు చెప్పి బయలుదేరిన ముగ్గురు శుక్రవారం ఉదయానికల్లా మామిడి తోటలో ఉరి వేసుకుని కనిపించారు. ఎంత పెద్ద వ్యాధికైనా చికిత్స అందుబాటులో ఉండడం, ఆర్థిక సమస్యలు కూడా లేకపోయినప్పటికీ మనోధైర్యం కోల్పోవడంతో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తుండగా గ్రామంలో విషాదం నెలకొంది. ముగ్గురి మృతదేహాలను పెనుబల్లి ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం సాయంత్రం గ్రామంలో అంత్యక్రియలు పూర్తిచేయగా గ్రామస్తులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కాగా, తల్లిదండ్రులు, సోదరి మృతితో ఒంటరిగా మిగిలిన వెంకటకృష్ణారావు కుమారుడు కార్తీక్ రోదిస్తుండగా ఆపడం ఎవరి తరం కాలేదు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,346

సర్వం సిద్ధం..



ప్రారంభానికి సిద్ధమైన జెన్‌కో ట్రైనింగ్ సెంటర్

- సీఎండీ ప్రభాకర్‌రావు పర్యటన కోసం ఏర్పాట్లు ముమ్మరం
- జెన్‌కో ట్రైనింగ్ సెంటర్, ఆక్సిజన్ ప్లాంట్లు ప్రారంభోత్సవం
- మూడు రోజుల పాటు కేటీపీఎస్, బీటీపీఎస్, భద్రాచలంలో పర్యటన
- పెండింగ్ సమస్యలపై దృష్టి సారించేనా?

పాల్వంచ: ఆరు నెలలగా వాయిదా పడుతున్న టీఎస్ జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు పర్యటన ఎట్టకేలకు ఖరారైంది. మూడు రోజుల పాటు జిల్లాలో ఆయన పర్యటించనున్నారని, అందుకు అన్ని ఏర్పాట్లు చేశామని అధికారులు తెలిపారు. ఏర్పాట్లను జెన్‌కో డైరెక్టర్ (సివిల్) అజయ్, ఓఎస్‌డీ రమేశ్, జెన్‌కో సీఈలు నారాయణ, శ్రీనివాస్, ట్రైనింగ్ సెంటర్, కేటీపీఎస్ 5, 6, 7 దశల సీఈలు పి.వెంకటేశ్వరరావు, ఎం.ప్రభాకర్ పర్యవేక్షిస్తున్నారు. 24వ తేదీ శనివారం కేటీపీఎస్ కాంప్లెక్స్‌లో సిద్ధమైన జెన్‌కో ట్రైనింగ్ సెంటర్, హాస్టల్, కేటీపీఎస్ ఓఅండ్ఎం కర్మాగారంలోని ఆక్సిజన్ ప్లాంట్లను కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావుతో కలిసి ప్రారంభించనున్నారు. జెన్‌కో ఇంటర్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో జరగనున్న మహిళా క్రీడా పోటీలు, పురుషుల లాన్ టెన్నిస్ క్రీడలను ప్రారంభించనున్నారు. 25వ తేదీ ఆదివారం మణుగూరు బీటీపీఎస్ కర్మాగారాన్ని సందర్శించనున్నారు. సెక్యూరిటీ హాస్టల్ బిల్డింగ్‌లు, ఎస్‌పీఎఫ్ కార్యాలయం, ప్రాజెక్ట్ హాస్టళ్లను ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావుతో కలిసి ప్రారంభించనున్నారు. నూతనంగా నిర్మిస్తున్న క్వార్టర్ల నిర్మాణాలు పరిశీలిస్తారు. 26వ తేదీ సోమవారం భద్రాచలం రాముడిని దర్శించుకుని, పూజలు చేసి తిరిగి మణుగూరు బీటీపీఎస్‌లోని రైల్వే ట్రాక్, స్విచ్ యార్డ్, కర్మాగారంలోని పెండింగ్‌లో ఉన్న పనులను పరిశీలించనున్నారు. అనంతరం హైదరాబాద్‌కు వెళ్లనున్నారు.

అంతా సన్నద్ధం..

రూ.8.5 కోట్లతో జెన్‌కో ట్రైనింగ్ సెంటర్, హాస్టల్ బిల్డింగ్ సముదాయాల నిర్మాణాలు పూర్తయ్యాయి. బ్యాచ్‌లవారీగా రాష్ట్రంలోని వివిధ జనరేటింగ్ స్టేషన్లలో పనిచేస్తున్న సిబ్బందికి ఇక్కడ శిక్షణ ఇవ్వడంతో పాటు, శిక్షణకాలంలో వారికి పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పిస్తారు. రోజువారీగా తరగతుల నిర్వహణ, భోజన వసతి, సీఈ, ఎస్ఈ, ఇతర ఇంజనీర్లు, సిబ్బంది కోసం ప్రత్యేక గదులు, అడ్మినిస్ట్రేషన్ బ్లాక్‌లతో కూడిన భవనాన్ని ఎంతో ఆధునిక పద్ధతిలో తీర్చిదిద్దారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్న సమయంలో వీటీపీఎస్ (విజయవాడ) కేంద్రంగా జెన్‌కో ట్రైనింగ్ సెంటర్ నడిచేది. తెలంగాణ రాష్ట్ర విభజన తర్వాత కేటీపీఎస్ కేంద్రంగా ఈ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. విద్యుత్ ఉత్పత్తికి సంబంధించిన అన్ని రకాల పరికరాలతో కూడిన సిమిలేటర్ గదులను రూ.2.5 కోట్లతో తీర్చిదిద్దారు. ఈ సిమిలేటర్ ద్వారా కర్మాగారాల్లో యూనిట్‌లో ఉండే టర్బైన్, ఈఎస్‌పీ, బాయిలర్ తదితర అన్ని విభాగాల పనితీరుపై అవగాహన, యూనిట్ నిర్వహణ సిస్టంను నడిపించే సామర్థ్యాలను వివరిస్తారు. కేటీపీఎస్ ఓఅండ్ఎం కర్మాగారంలో రూ.2.47 కోట్లతో ఆక్సిజన్ ప్లాంట్ నిర్మాణ పనులు సైతం పూర్తయ్యాయి. గాలి నుంచి ఆక్సిజన్ ఉత్పత్తి చేసే కేటీపీఎస్ ప్లాంట్‌లో రోజుకు 1,050 క్యూబిక్ మీటర్ల ఆక్సిజన్ తయారు చేస్తుంది. దీంతో 7 క్యూబిక్ మీటర్ల సామర్థ్యం గల 150 సిలిండర్లను నింపవచ్చు. ఇక్కడి నుంచి రాష్ట్రంలోని ఇతర జనరేటింగ్ స్టేషన్లకు సిలిండర్లను సరఫరా చేయనున్నారు.

హడావుడిగా పనులు

సీఎండీ పర్యటన నేపథ్యంలో అధికారులు హడావుడిగా పనులు చేపట్టి ఇబ్బడిముబ్బడిగా ఖర్చు చేస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. టెన్నిస్ కోర్టు వద్ద రోడ్డు నిర్మించారు. సీ-కాలనీ నుంచి ప్లాంట్ వరకు పారిశుద్ధ్య పనులు చేశారు. రంగులు వేయడం, గ్రీనరీ కూడా ఏర్పాటు చేశారు. కానీ, ఈ పనులను టెండర్లు లేకుండా కాంట్రాక్టర్లకు అప్పగించారు.

పరిష్కరిస్తారా?

- పాల్వంచలో కేటీపీఎస్ ఉద్యోగుల కోసం నూతన క్వార్టర్ల నిర్మాణ పనులు ఇంకా ప్రారంభం కాలేదు. కాలంచెల్లిన క్వార్టర్లలోనే ఉద్యోగులు అనేక ఇబ్బందుల మధ్య నివాసం ఉంటున్నారు. శిథిలావస్థలో ఖాళీగా ఉంటున్న క్వార్టర్లు అనేక అసాంఘిక కార్యాకలాపాలకు అడ్డాగా మారుతున్న నేపథ్యంలో వాటిని తక్షణం తొలగించాలని, నిర్మాణ పనులను ప్రారంభించాలని కార్మికులు కోరుతున్నారు.
- కేటీపీఎస్ యాష్‌పాండ్ నుంచి స్థానిక పరిశ్రమలకు గతంలో ఉచితంగా బూడిదను అందించేవారు. గత మార్చి నుంచి ఇవ్వడం లేదు. దీంతో కొత్తగూడెం, పాల్వంచ పరిసర ప్రాంతాల్లో ఈ బూడిదపై ఆధారపడిన సుమారు 40 ఫ్యాక్టరీలు, 500 మంది వరకు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో మంత్రి కేటీఆర్ ఇచ్చిన మాట ప్రకారం తిరిగి ఉచితంగా బూడిదను అందించాలని కోరుతున్నారు.
- కోఆపరేటివ్ సొసైటీ నుంచి రూ.15 లక్షల వరకు రుణాలిస్తామని గతంలో పాలకవర్గం హామీ ఇచ్చిందని, కానీ రూ.10 లక్షలు మాత్రమే ఇస్తున్నారని వాటిని పెంచేలా చూడాలని ఉద్యోగులు కోరుతున్నారు. బీటీపీఎస్‌లో కూడా కోఆపరేటివ్ సొసైటీ కార్యాలయం ఇవ్వాలని ఉద్యోగులు కోరుతున్నారు.
- కన్జూమర్ స్టోర్ ఇప్పటికే మూతబడింది. స్టోర్‌లో నిల్వ ఉన్న రూ.70 లక్షల నిధులు, సరుకులు, సుమారు 600 గ్యాస్ సిలిండర్లు ఏమయ్యాయనే విషయాలను బహిర్గతం చేయాలని కోరుతున్నారు.
- కేటీపీఎస్ ఆస్పత్రిని సూపర్ స్పెషాలిటీగా మార్చాలని, స్పెషలిస్ట్ వైద్యులను అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.



పారిశుద్ధ్య పనులు చేస్తున్న సిబ్బంది..

నలుగురి మృతికి కారణమైన వ్యక్తికి రెండేళ్ల జైలు

కల్తీ కల్లు కారణంగా 2013లో ఘటన

కొత్తగూడెంటౌన్: కల్తీ కల్లు విక్రయించి నలుగురి మృతికి కారణమైన ఇల్లెందు మండలం ఎల్లాపురానికి చెందిన కంభంపాటి రామయ్యకు రెండేళ్ల జైలుశిక్షతో పాటు రూ.1000 జరిమానా విధిస్తూ శుక్రవారం కొత్తగూడెం అదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఆడెపు నీరజ తీర్పు చెప్పారు. ఎల్లాపురానికి చెందిన 14 మంది 2013 జనవరి 30న మంటబాలుతండా శివారులోని కంభంపాటి రామయ్య కల్లు దుకాణానికి వెళ్లి ఈత కల్లు తాగారు. అనంతరం వాంతులు, విరేచనాలు చేసుకుంటుండగా గమనించిన స్థానికులు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఖమ్మంలోని మమత ఆస్పత్రికి తరలించారు. 2013 ఫిబ్రవరి 1న కల్తీ స్వామి, మూడు సాయిలు, ఫిబ్రవరి 9న బానోతు లింబ్రా, 10న బానోతు భిక్షా మరణించారు. ఫిబ్రవరి 1న పోలీస్ స్టేషన్‌లో బాధితుల కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. 34 మంది సాక్షులను విచారించిన అనంతరం కంభంపాటి రామయ్యపై నేరం రుజువు కావడంతో రెండేళ్ల జైలుశిక్షతో పాటు రూ.1000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పీవీడీ లక్ష్మి, కోర్టు లైజన్ ఆఫీసర్ ఎం.హరిగోపాల్, కోర్టు డ్యూటీ ఆఫీసర్ బి.రామరావు సహకరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



లింగన్న (ఫైల్)

అశ్వాపురం: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. మండల కేంద్రంలోని ఎస్సీకాలనీకి చెందిన ఇసంపల్లి లింగన్న (32) స్థానిక ఎస్‌బీఐలో అటెండర్‌గా పనిచేస్తున్నాడు. లింగన్న తన మిత్రుడు మణుగూరుకు చెందిన సనపా కరుణాకర్ బైక్‌పై మణుగూరు వెళ్తుండగా మార్గమధ్యలో కల్యాణపురం వద్ద మణుగూరు-కొత్తగూడెం ప్రధాన రహదారిపై అదుపుతప్పి కిందపడ్డారు. ఈ ఘటనలో బైక్ వెనుక కూర్చున్న లింగన్న తలకు బలమైన గాయాలు కాగా, కరుణాకర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు 108కు ఫోన్ చేయగా ఎంతకూ రాకపోవడంతో కుటుంబసభ్యులు, స్థానికులు ప్రైవేట్ వాహనంలో మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ లింగన్న మృతి చెందాడు. కాగా, కరుణాకర్ అతివేగంగా, అజాగ్రత్తగా బైక్ నడపడంతోనే ప్రమాదం జరిగిందని లింగన్న తండ్రి వెంకన్న ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు అశ్వాపురం ఎస్‌ఐ సురేశ్ తెలిపారు. లింగన్నకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కూరగాయల కోసం వచ్చి వ్యక్తి...



చిన్నకొమరయ్య మృతదేహం

పాల్వంచ: కూరగాయల కోసం వచ్చిన వ్యక్తి గుండెపోటుతో మృతి చెందిన శుక్రవారం పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పాల్వంచ మండలం మొండికట్ట గ్రామానికి చెందిన రాపోలు చిన్నకొమరయ్య (65) కొంతకాలంగా పట్టణంలోని కాంట్రాక్టర్స్‌కాలనీలో ఉంటున్నారు. కూరగాయలు కొందామని ఇంటి నుంచి బీసీఎంరోడ్‌కు వచ్చాడు. ఒక్కసారిగా గుండెపోటు రావడంతో రోడ్డుపైనే కింద పడిపోయి చనిపోయాడు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ప్రవీణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి...



రామచంద్రమూర్తి (ఫైల్)

పినపాక: పొలంలో చెట్టుకొమ్మలు నరుకుతూ విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం .. పినపాకకు చెందిన చెందిన కొమరం రామచంద్రమూర్తి (45) తన వ్యవసాయ క్షేత్రంలో చెట్టుకొమ్మలు తొలగించేందుకు వెళ్లాడు. చెట్టు ఎక్కి కొమ్మలు నరుకుతుండగా అవి పక్కనే ఉన్న 11 కేవీ విద్యుత్ వైర్లపై పడ్డాయి. విద్యుదాఘాతంతో రామచంద్రమూర్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు కిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ దిలీప్ తెలిపారు.

భార్యాభర్తల నడుమ ఘర్షణలో భార్య మృతి

రఘునాథపాలెం: మండలంలోని కే.వీ.బంజరకు చెందిన దంపతులు ఖమ్మంలో ఉంటుండగా.. ఇద్దరి మధ్య జరిగిన ఘర్షణలో భార్య మృతి చెందినట్లు తెలిసింది. కే.వీ.బంజరకు చెందిన సాయిరాం తన భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి ఖమ్మంలో ఉంటున్నాడు. ఆయన సెక్యూరిటీ గార్డ్‌గా, భార్య ఆస్పత్రిలో స్వీపర్‌గా పని చేస్తున్నట్లు సమాచారం. ఈక్రమంలో గురువారం ఇద్దరు ఘర్షణ పడగా సాయిరాం భార్య తలను గోడకు కొట్టడంతో తీవ్రంగా గాయపడిన ఆమె చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు తెలిసింది. ఆతర్వాత మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు పూర్తిచేశారని సమాచారం.

జాబ్‌మేళాకు 106 మంది హాజరు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని ఐటీ హబ్‌లో శుక్రవారం టామ్‌కామ్ ఆధ్వర్యాన ఉద్యోగాల భర్తీ కోసం జాబ్‌మేళా నిర్వహించగా 106 మంది హాజరయ్యారు. వీరిలో 32 మందిని మొదటి రౌండ్‌కు ఎంపిక చేసినట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి కొండపల్లి శ్రీరాం ఒక ప్రకటనలో తెలిపారు. రెండో రౌండ్ ఇంటర్వ్యూలు త్వరలోనే నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాలో టామ్‌కామ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పోలీస్ క్యాంపుపై మావోయిస్టుల దాడి

చర్ల: సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మావోయిస్టులు పోలీసు క్యాంప్‌పై దాడికి దిగారు. బీజాపూర్ జిల్లా గంగులూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని హిరేలీ సీఆర్‌పీఎఫ్ క్యాంపుపై దాడికి దిగిన మావోయిస్టులు తుపాకీలతో కాల్పులు జరుపుతూ రాకెట్ లాంఛర్లను వేశారు. అయితే, మావోయిస్టుల దాడిని గమనించిన క్యాంపులోని జవాన్లు అప్రమత్తమై ఎదురుకాల్పులకు దిగడంతో మావోయిస్టులు పారిపోయారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి నష్టం వాటిల్లలేదు.

బాలుడి అదృశ్యం



పట్టాభిరామయ్య (ఫైల్)

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఏఎస్ఆర్‌కాలనీకి చెందిన 13 ఏళ్ల ఎర్రా పట్టాభిరామయ్య ఈ నెల 20వ తేదీన ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు.. బంధువులు, మిత్రులు, చుట్టుపక్కలవారి వద్ద ఆరాతీసినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో బాలుడి అన్నయ్య ఉమామహేశ్వరరావు శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

తప్పిపోయిన బాలుడి ఆచూకీ లభ్యం



తప్పిపోయిన బాలుడిని తల్లికి అప్పగిస్తున్న పోలీసులు

దుమ్ముగూడెం: మండలంలోని చిన్నబండిరేవు గ్రామంలో బంధువుల ఇంటికి వచ్చి తప్పిపోయిన బాలుడు జగదీశ్‌ను పోలీసులు పట్టుకుని శుక్రవారం తల్లికి అప్పగించారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలానికి చెందిన జగదీశ్ కుటుంబ సభ్యులు చిన్నబండిరేవులోని బంధువుల ఇంటికి వచ్చారు. కాగా ఈ నెల 17వ తేదీ సాయంత్రం నుంచి జగదీశ్ కనిపించక పోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. సీఐ రమేశ్, ఎస్‌ఐ కేశవ్ ఆధ్వర్యంలో రెండు బృందాలుగా ఏర్పడి బాలుడి ఆచూకీ కోసం ప్రయత్నించారు. కొత్తగూడెంలో ఆచూకీ లభ్యం కావడంతో బాలుడిని పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి తల్లికి అప్పగించారు.

మట్టి తరలిస్తున్న టిప్పర్ సీజ్..



మట్టి లోడుతో ఉన్న టిప్పర్

జూలూరుపాడు: అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్‌ను శుక్రవారం రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. తహసీల్దార్ శారద కథనం ప్రకారం.. పడమటనర్సాపురం గ్రామంలోని అసైన్డ్ భూమిలో అక్రమంగా మట్టి తవ్వి టిప్పర్‌లో తరలిస్తుండగా గ్రామస్తులు గురువారం అర్ధరాత్రి అడ్డుకుని, శుక్రవారం రెవెన్యూ సిబ్బందితో కలిసి స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి తీసుకొచ్చారు. టిప్పర్‌ను సీజ్ చేశామని, సంబంధిత వ్యక్తులకు జరిమానా విధిస్తామని తహసీల్దార్ తెలిపారు.

జేవీఆర్ ఓసీని సందర్శించిన డైరెక్టర్



సీహెచ్‌పీలో పరిశీలిస్తున్న డైరెక్టర్, అధికారులు

సత్తుపల్లిరూరల్: మండలంలోని జేవీఆర్ ఓసీని సింగరేణి డైరెక్టర్ జి.వెంకటేశ్వరరెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో సమావేశమైన ఆయన బొగ్గు ఉత్పత్తి, రవాణా సమయాన పాటించాల్సిన భద్రతా చర్యలపై సూచనలు చేశారు. తగిన రక్షణ చర్యలు పాటిస్తూ ఉత్పత్తి, రవాణాకు అంతరాయం ఏర్పడకుండా చూడాలని తెలిపారు. కొత్తగూడెం ఏరియా ఏజీఎం వై.రఘురామిరెడ్డి, అధికారులు కె.సోమశేఖర్, నర్సింహారావు, చలపతిరావు, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లను పరిశీలించిన అదనపు కలెక్టర్



జూలూరుపాడులో కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

కొణిజర్ల/ఏన్కూరు/జూలూరుపాడు: వైరా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పోలింగ్ బూత్‌లను శుక్రవారం ఖమ్మం అదనపు కలెక్టర్ మధుసూదన్ పరిశీలించారు. కొణిజర్ల మండల కేంద్రంతో పాటు ఏన్కూరు మండలం బురదరాఘవాపురం, ఏన్కూరు, జూలూరుపాడు మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆయన సౌకర్యాలపై ఆరా తీశారు. అలాగే, ఓటరు జాబితా క్షుణ్ణంగా పరిశీలించి అనర్హులు ఉంటే తొలగించాలని, కొత్తగా ఓటు కోసం దరఖాస్తు చేసుకునేలా యువతకు అవగాహన కల్పించాలని ఉద్యోగులకు సూచించారు. తహసీల్దార్లు దొడ్డారపు సైదులు, ముజాహిద్, శారద, ఉద్యోగులు రాజశేఖర్, లాలయ్య, అరుణ, పి.శ్రీనివాస్, తిరుపతిరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అన్నం ఫౌండేషన్‌కు..



మతిస్థిమితం లేని వ్యక్తితో అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు, ఎస్‌ఐ షాహీనా

అన్నపురెడ్డిపల్లి: మతిస్థిమితం సరిగా లేని వ్యక్తిని ఖమ్మంలోని అన్నం ఫౌండేషన్‌కు తరలించిన ఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. మూడు నెలల నుంచి మండల కేంద్రంలోని ఆలయాలు, చెట్లు, రహదారిపై మతిస్థిమితం సరిగా లేని వ్యక్తి సంచరిస్తున్నాడు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్‌ఐ షాహీన ఆ వ్యక్తి వివరాలు సేకరించాలని ప్రయత్నించగా సరిగా చెప్పలేకపోయాడు. ఖమ్మంలోని అన్నం ఫౌండేషన్‌కు సమాచారం అందించగా శుక్రవారం రాత్రి ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు తన బృందంతో అన్నపురెడ్డిపల్లికి వచ్చారు. స్థానిక పోలీసులతో కలిసి ఆ వ్యక్తి జాడ కోసం వెతికారు. మండలంలోని బుచ్చన్నగూడెం రామాలయం వద్ద ఆ వ్యక్తిని గుర్తించి ఖమ్మం తీసుకెళ్లారు. సదురు వ్యక్తి తమిళం మాట్లాడుతున్నాడని, వివరాలు చెప్పలేకపోతున్నాడని శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ షాహీనాను పలువురు అభినందించారు.

రూ.16 లక్షల వసూలుపై కేసు నమోదు

ఖమ్మంఅర్బన్: గొలుసుకట్టు విధానంలో డబ్బు కడితే లాభాలు వస్తాయని నమ్మించి మోసం చేశారని ఖమ్మం యూపీహెచ్ కాలనీకి చెందిన దంపతులపై శ్రీనగర్‌కాలనీకి చెందిన పి.నాగేశ్వరరావు ఖమ్మం అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. యూపీహెచ్ కాలనీకి చెందిన భార్యాభర్తలు ఎ.సరిత, బాబు ప్రతీ వారం డబ్బు కడితే నెలకు రూ.50 వేలు వస్తాయని నమ్మబలికి పలువురి నుంచి గొలుసు కట్టు విధానంలో రూ.16 లక్షలు వసూలు చేశారని పేర్కొన్నాడు. అయితే, అసలు డబ్బు కూడా ఇవ్వకుండా వేధిస్తున్నారని ఫిర్యాదు చేయగా చీటింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

భద్రాద్రిలో తొలకరి పలకరింపు



పట్టణంలో కురుస్తున్న వర్షం

భద్రాచలంలో శుక్రవారం తొలకరి వర్షం కురిసింది. దీంతో పట్టణవాసులు హర్షం వ్యక్తం చేశారు. నైరుతి రుతుపవనాలు తెలంగాణాలోకి ప్రవేశించడం, వర్షం కురవడంతో ఇన్ని రోజులూ ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు ఉపశమనం పొందారు. – భద్రాచలంటౌన్

క్లుప్తంగా...

'పోడు' పంపిణీ వాయిదా?

తొలుత ఈ నెల 24 నుంచే ఇస్తామన్న ప్రభుత్వం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: పోడు పట్టాల పంపిణీలో జాప్యం జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నెల 24 నుంచే జిల్లాల్లో సభలు నిర్వ హించి లబ్ధిదారులకు అందజేయాలని సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఆ దిశగా జిల్లాల్లో ఎ లాంటి ఏర్పాట్లు చేయకపోవడంతో ఈ కార్యక్రజుమం వాయిదా పడినట్లు కనిపిస్తోంది. షెడ్యూల్ ప్రకారం శనివారం సీఎం కేసీఆర్ కుమురంభీం జిల్లాలో పర్యటించి కొత్త కలెక్టరేట్, ఎస్పీ, బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలను ప్రారంభించాల్సి ఉంది. అక్కడే బహిరంగ సభలో పోడు పట్టాలను పంపిణీ చేయాలి. ఇదే సమయంలో ఈ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభం కావలసి ఉంది. జిల్లాల్లో అధికార యంత్రాంగం ఎన్నికల నిర్వహణపై సమావేశాలు ఉండడంతో అటు పోలీసు ఉన్నతాధికారులు, కలెక్టర్లు హైదరాబాద్‌లోనే ఉన్నారు. దీంతో పోడు పట్టాల పంపిణీ ముందుగా ప్రకటించినట్లు కాకుండా.. మరింత జాప్యం జరిగే అవకాశం ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా లక్షన్నర మంది గిరిజన లబ్ధిదారులకు 4 లక్షల ఎకరాల(ఆర్వోఎఫ్ఆర్) అటవీ భూములపై హక్కులు కల్పించి, ఈ సీ జన్ నుంచే రైతుబంధు వర్తింపజేయాలని ప్రణాళిక రూపొందించారు. పట్టాలు ఇవ్వడంలోనే ఆలస్యం అవుతుండడంతో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల సేకరణ, రైతుబంధు జమ ఈ సీజన్‌లోనే జరుగుతుందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు ఈ నెల 26 నుంచే రైతుబంధు ఇచ్చేందుకు రంగం సిద్ధమైంది.

శేజల్‌తో బీఆర్ఎస్ నేతల చర్చలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య లైంగికంగా వేధించి, తమపై కేసులు పెట్టించారని గత రెండు నెలలు నుంచి పలు రకాలుగా ఆందోళన చేస్తున్న ఆరిజన్ నిర్వాహకురాలు శేజల్‌తో బీఆర్ఎస్ ఎంపీలు శుక్రవారం చర్చలు జరిపారు. బీఆర్ఎస్ ఎంపీలు రంజిత్‌రెడ్డి, వెంకటేశ్ నేత, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్ కుమార్‌లు శేజల్, ఆదినారాయణలతో సుదీర్ఘంగా మాట్లాడినట్లు తెలుస్తోంది. ఈ చర్చల్లో ప్రభుత్వ భూమి కొనుగోలు చేసిన డబ్బులు వాపస్, తమపై ఉన్న కేసుల ఎత్తివేత, ఎమ్మెల్యే చిన్నయ్యపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిసింది. ఇందుకు తప్పు చేసిన వారిపై పార్టీలో క్రమశిక్షణ చర్యలుంటాయని, అలాగే ఆమెకు న్యాయం చేస్తామని నాయకులు హామీ ఇచ్చినట్లు తెలిసింది.

త్వరలో 'వైద్య' ఫీజుల పెంపు!

- కాలేజీలవారీగా ఫీజుల సవరణకు కసరత్తు చేసిన టీఏఎఫ్ఆర్సీ
- ధరలు పెరిగినందున ఫీజులు పెంచాలని యాజమాన్యాల విన్నపం
- ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే పెంపునకు రంగం సిద్ధం

సాక్షి, హైదరాబాద్: ఎంబీబీఎస్, బీడీఎస్, పీజీ మెడికల్ తదితర వైద్య కోర్సుల అడ్మిషన్ల ప్రక్రియ త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో ఫీజుల పెంపునకు రంగం సిద్ధమైంది. ఈ అంశానికి సంబంధించి తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీ రెగ్యులేటరీ కమిటీ (టీఏఎఫ్ఆర్సీ) కసరత్తు పూర్తి చేసింది. దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే ఫీజులను సవరించనుంది. ఎంబీబీఎస్, పీజీ మెడికల్ సహా ఇతర కోర్సుల ఫీజులను మూడేళ్లకోసారి సవరించాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. గతంలో ఏడాదికోసారి 5 శాతం చొప్పున సవరించాలన్న నిర్ణయాన్ని మార్పు చేశారు. ఆ ప్రకారం ఈసారి తప్పనిసరిగా ఫీజుల సవరణ జరుగుతుందని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయ వర్గాలు వెల్లడించాయి. ఇప్పటికే ప్రైవేటు కాలేజీల్లో మెడికల్ కోర్సుల ఫీజులు రూ. లక్షల్లో ఉండగా త్వరలో అంతకు మించి పెరిగే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

ఒక్కో మెడికల్ కాలేజీకి ఒక్కో ఫీజు...

ఇప్పటివరకు రాష్ట్రంలో మెడికల్ కోర్సుల ఫీజులు ఒకే రీతిన ఉన్నాయి. ఇకపై ఒక్కో కాలేజీలో ఒక్కో రకమైన ఫీజు ఉండనుంది. ఆ ప్రకారమే ఎంబీబీఎస్, పీజీ మెడికల్ సహా ఇతర వైద్య కోర్సుల ఫీజులుంటాయి. అందుకు అనుగుణంగానే కాలేజీలవారీగా ఆడిట్ రిపోర్టులను టీఏఎఫ్ఆర్సీ తీసుకుంది. వాటి ఆధారంగానే ఫీజుల సవరణ చేయనుంది. ఇందులో కాలేజీల నిర్వహణ ఖర్చులు మొదలు, బోధన, బోధనేతర సిబ్బంది వేతనాలు, ల్యాబ్‌ల నిర్వహణ తదితర పూర్తిస్థాయి సమాచారం సేకరించారు. ఈ ఖర్చులు గ్రామీణ ప్రాంతాల్లోని కాలేజీల్లో ఒక రకంగా ఉంటే పట్టణ ప్రాంతాల్లోని కాలేజీల్లో మరో రకంగా ఉంటాయి. ఈ దిశగా కాలేజీవారీగా ఆడిట్ నివేదికలు పరిశీలించిన టీఏఎఫ్ఆర్సీ ఫీజుల సవరణపై ఒక అంచనాకు వచ్చింది. కాలేజీలవారీగా ఫీజుల పెంపు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి సమర్పించినట్లు తెలిసింది. దీంతో ఫీజుల పెంపు వ్యవహారంపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనుంది. ధరలు పెరిగినందున ఆ మేరకు ఫీజులు పెంచాలని యాజమాన్యాలు ఇప్పటికే విజ్ఞప్తి చేశాయి.

కొన్ని కాలేజీల్లో 20 శాతం వరకు పెరిగే అవకాశం...

ప్రస్తుతమున్న ఫీజులను కొన్ని కాలేజీలు 20 శాతం వరకు పెంచాలని కోరగా మరికొన్ని 10 శాతం, కొన్ని 5 శాతం, ఇంకొన్ని యథాతథంగా ఉంచాలని కోరినట్లు సమాచారం. ప్రైవేటు కాలేజీల్లో ప్రస్తుతం ఎంబీబీఎస్ సీట్లకు సంబంధించి ఏ–కేటగిరీ (కనీ్వనర్) ఫీజు రూ. 60 వేలు ఉండగా బీ–కేటగిరీ ఫీజు రూ. 11.55 లక్షలుగా ఉంది. ఇక సీ–కేటగిరీ (ఎన్ఆర్ఐ) అడ్మిషన్ ఫీజు బీ–కేటగిరీకి రెట్టింపు అంటే రూ. 23.10 లక్షల వరకు వసూలు చేసుకొనే వీలుంది. ఇక పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి ఏ–కేటగిరీ ఫీజు రూ. 7.5 లక్షలు, బీ–కేటగిరీ రూ. 28 లక్షల నుంచి రూ. 30 లక్షల చొప్పున ఉన్నాయి. బీడీఎస్ కోర్సులకు సంబంధించి ఏ–కేటగిరీ ఫీజు రూ. 45 వేలు ఉండగా బీ–కేటగిరీ ఫీజు రూ. 4.2 లక్షలు, ఇక సీ–కేటగిరీ ఫీజు బీ–కేటగిరీ కంటే రెట్టింపు వసూలు చేసుకోవచ్చు. వాటితోపాటు బీఎస్సీ నర్సింగ్, ఎంఎస్సీ నర్సింగ్, బీఏఎంఎస్, బీహెచ్ఎంఎస్, హోమియోపతి, పారామెడికల్ కోర్సులకు సంబంధించిన ఫీజులు కూడా కాలేజీలవారీగా భిన్నంగా ఉన్నాయి.

కాళేశ్వరం బ్యారేజీలకు మరమ్మతులేవి?

గత ఏడాది వరదలకు కొట్టుకుపోయిన గేట్ల ముందు కాంక్రీటు దిమ్మెలు

- మరమ్మతులు చేయడంలో ఇరిగేషన్ శాఖ జాప్యంపై విమర్శలు
- ఈ సీజన్‌లో మళ్లీ భారీ వర్షాలు వస్తే కోతకు గురయ్యే అవకాశం
- గేట్లకు ప్రమాదం ఉందంటున్న నిపుణులు



అన్నారంలోని సరస్వతి బ్యారేజీ వద్ద కొట్టుకుపోయిన కాంక్రీటు దిమ్మెలు

కాళేశ్వరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని లింకు–1 బ్యారేజీల వద్ద గత ఏడాది వచ్చిన భారీ వరదలతో కాంక్రీటు దెబ్బతింది. అయితే మళ్లీ వానాకాలం వచ్చినప్పటికీ దెబ్బతిన్న చోట్ల ఇప్పటికీ మరమ్మతులు చేయకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబట్‌పల్లిలోని మేడిగడ్డ (లక్ష్మి) బ్యారేజీ, అన్నారంలోని (సరస్వతి) బ్యారేజీల వద్ద వరద తాకిడికి గేట్ల ముందు భాగంలోని కాంక్రీటు దిమ్మెలు కొట్టుకుపోయాయి. గత సీజన్‌లో ఇది జరిగితే ఇప్పటికీ ఇరిగేషన్ శాఖ అధికారులు మరమ్మతుల విషయంలో ఆలోచన చేయడం లేదని, ఖరీఫ్ సీజన్ ఆరంభం అవుతున్నా పనుల్లో జాప్యం చేస్తున్నారని నీటిపారుదల రంగ నిపుణులు ఆక్షేపిస్తున్నారు.

గతేడాది ఉధృతంగా వరద

గత ఏడాది కురిసిన భారీవర్షాలకు బ్యారేజీలు కొంతమేర దెబ్బతిన్నాయి. ఎగువ గోదావరి నుంచి సరస్వతీ బ్యారేజీ వద్ద 17.50 లక్షల క్యూసెక్కుల వరద జూలై 14–15 తేదీల్లో ఉధృతంగా ప్రవహించింది. దీంతో బ్యారేజీలోని మొత్తం 66 గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలారు. వరద ఉధృతికి గేట్ల కింది భాగాన ఉన్న కాంక్రీట్ దిమ్మెలు లేచిపోయాయి. అలాగే గోదావరి వరదకు, ప్రాణహిత వరద తోడై మేడిగడ్డలోని లక్ష్మీబ్యారేజీ వద్ద 29 లక్షల క్యూసెక్కులకుపైగా వరద రావడంతో దిమ్మెలు చెల్లాచెదురుగా కొట్టుకుపోయాయి.

కాంక్రీటు దిమ్మెలు ఇలా..

బ్యారేజీల్లో గేట్లు ఎత్తినప్పుడు వరద తాకిడికి నేల కోతకు గురికాకుండా ముందు భాగంలో ఇంజనీరింగ్ శాఖ అధికారులు అత్యాధునిక టెక్నాలజీతో కాంక్రీటు దిమ్మెలను అమర్చారు. 3 అడుగుల వెడల్పు, పొడవుతో దిమ్మెలను బ్యారేజీ పొడవునా గేట్ల కింద ముందు భాగంలో కాంక్రీటు చేశారు. వరద తాకిడికి నేల కోతకు గురికాకుండా ఈ దిమ్మెలు అడ్డుకుంటాయి. కానీ గత ఏడాది వచ్చిన భారీ వరద తాకిడికి ఈ దిమ్మెలు విరిగి ఎక్కడికక్కడ చెల్లాచెదురుగా పడి కొట్టుకుపోయాయి. అప్పటి నుంచీ అక్కడ మరమ్మతులు చేయలేదని చెబుతున్నారు.

డిజైన్స్ రాలేదని..

మేడిగడ్డ (లక్ష్మి), అన్నారం (సరస్వతి) బ్యారేజీల వద్ద అమర్చిన దిమ్మెలు కొట్టుకుపోయి ఏడాది కావస్తున్నా.. డిజైన్స్ తయారు చేయలేదని ఇంజనీరింగ్ శాఖ పేర్కొంటోంది. ఈ నేపథ్యంలో మరమ్మతులు చేయకుండానే మళ్లీ వర్షాకాలం ఆరంభమైంది. వర్షాలు ఏకధాటిగా కురిస్తే మరోసారి భారీ వరదలు వచ్చే అవకాశం ఉంది. బ్యారేజీల గేట్లు ఎత్తితే మరింత కోతకు గురయ్యే ప్రమాదం ఉంది. గత ఏడాది కురిసిన వర్షాలకు ఇప్పటికే గేట్ల ముందుభాగంలో కోతకు గురై, భారీగా ఇసుక మేటలు వేశాయి. దీంతో గేట్లకు కూడా ప్రమాదం పొంచి ఉందని నిపుణులు అంటున్నారు.

మోడల్ స్టడీ చేయాలి

గేట్ల ముందు భాగంలో కాంక్రీటు దిమ్మెలు లేచింది వాస్తవమే. కానీ డిజైన్స్ తయారు చేయాలి. దీనిపై ప్రొఫెసర్లు అధ్యయనం చేయాల్సి ఉంది. వారు మోడల్ స్టడీ చేయాలి. తరువాతనే మరమ్మతులు చేస్తారు. పలుమార్లు ఇరిగేషన్ శాఖ తరఫున ప్రభుత్వానికి నివేదికలు అందజేశాం. డిజైన్స్ తయారీకి కొంత సమయం పడుతుంది.

– యాదగిరి, ఈఈ, అన్నారం బ్యారేజీ

ఇన్విజిలేటర్ కొట్టాడని విద్యార్థి బలవన్మరణం

- మృతదేహంతో కళాశాల ఎదుట కుటుంబ సభ్యుల ధర్నా
- కొట్టలేదన్న కాలేజీ యాజమాన్యం



మృతదేహంతో కళాశాల ఎదుట ధర్నా చేస్తున్న కుటుంబ సభ్యులు

నర్సంపేట రూరల్: పరీక్షల్లో మాస్ కాపీయింగ్ చేస్తుండగా ఇన్విజిలేటర్ మందలించి, చేయి చేసుకోవడంతో మనస్తాపానికి గురైన ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన వరంగల్ జిల్లాలో జరిగింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా ఖానాపురం మండలం రాగంపేటకు చెందిన భూక్యా ఈర్య–పద్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. పెద్ద కుమారుడు భూక్య సాయికుమార్ (23) నర్సంపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. బ్యాక్‌లాగ్‌లు ఉండడంతో అదే పట్టణంలోని బాలాజీ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల సెంటర్‌లో సప్లిమెంటరీ పరీక్షలు రాస్తున్నాడు. గురువారం పరీక్షలో మాస్ కాపీయింగ్‌కు పాల్పడటంతో గమనించిన ఇన్విజిలేటర్.. సాయికుమార్‌ను మందలించి కొట్టాడు. దీంతో మనోవేదనకు గురై, రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. సాయికుమార్ మృతికి ఇన్విజిలేటర్, యాజమాన్యం కారణమంటూ కుటుంబ సభ్యులు.. మృతదేహంతో కాలేజీ ఎదుట శుక్రవారం మధ్యాహ్నం ధర్నా చేపట్టారు. ఉద్రిక్తత నెలకొనడంతో కళాశాల యాజమాన్యం, కుటుంబ సభ్యులతో మాట్లాడిన నర్సంపేట సీఐ పులి రమేష్‌గౌడ్... మృతదేహాన్ని గ్రామానికి పంపించారు. దీనిపై కళాశాల ప్రిన్సిపాల్ రామ్‌రాజ్‌ను వివరణ కోరగా... సాయి కుమార్ అనే విద్యార్థి పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌తోపాటు బుక్‌లెట్‌ను దొంగతనం చేయడానికి ప్రయత్నించాడని, గుర్తించిన ఇన్విజిలేటర్ మందలించి, తమ వద్దకు తీసుకొచ్చారని తెలిపారు. విద్యార్థి రిక్వెస్ట్‌తో పరీక్ష రాసేందుకు అనుమతించామే తప్ప.. ఎవరూ కొట్టలేదన్నారు.

సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు వాయిదా

అక్టోబర్ 1 తర్వాత నిర్వహించుకోవచ్చని హైకోర్టు సూచన

గోదావరిఖని (రామగుండం): సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఎన్నికల నిర్వహణకు నాలుగు నెలల గడువు కావాలని సింగరేణి గనులు విస్తరించి ఉన్న జిల్లాల కలెక్టర్లు కోర డంతో హైకోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. శుక్రవా రం సింగరేణి ఎన్నికలపై హైకోర్టులో విచారణ జరి గింది. వాదనలు విన్న తర్వాత హైకోర్టు అక్టోబర్ 1 తర్వాత ఎన్నికలు నిర్వహించుకోవచ్చని సూచిస్తూ ఆదేశాలు జారీ చేసింది. దీంతో శనివారం హైదరా బాద్‌లో జరగనున్న ఆర్ఎల్‌సీ సమావేశం వాయిదాపడింది. సింగరేణిలో గుర్తింపు సంఘం కాలప రిమితి నాలుగేళ్లు ఉండాలని కోరుతూ టీబీజీకేఎస్ కూడా హైకోర్టులో పిటిషన్ వేసింది. ఈ క్రమంలో హైకోర్టు సింగరేణి యాజమాన్యానికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. అంతేకాకుండా జాతీయ ఎన్నికల కమిషన్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలపై దృష్టి సారించిన నేపథ్యంలో సింగరేణి ఎన్నికలకు ఏర్పాట్లు చేయలేమని ప్రభుత్వ యంత్రాంగం కూడా చేతులెత్తేసినట్లు తెలుస్తోంది.

మరో ఏడాది వాయిదా పడే అవకాశం

అక్టోబర్ తర్వాత ఎన్నికలు నిర్వహించుకోవచ్చని కోర్టు సూచించిన నేపథ్యంలో ఎన్నికలు మరో ఏడాది వాయిదా పడే అవకాశాలు కన్పిస్తున్నాయి. అక్టోబర్‌లో సాధారణ ఎన్నికల బిజీలో పోలీసు, రెవెన్యూ యంత్రాంగం ఉండే అవకాశముంది. ఈ నేపథ్యంలో జనవరి వరకు సింగరేణి ఎన్నికలు నిర్వహించే వీలుండదని కొందరు చెబుతున్నారు.

ధాన్యానికి రికార్డుస్థాయి ధర రూ. 2,911

కేసముద్రం: మహబూబాబాద్ జిల్లా కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యానికి రికార్డు స్థాయిలో ధర రూ.2,911 పలికింది. మార్కెట్‌లో ధాన్యం సీజన్ మొదలైనప్పటి నుంచి ఇంత ధర రావడంఇదే మొదటిసారి. గూడూరు మండలం అప్పరాజుపల్లికి చెందిన మనోజ్‌కుమార్ అనే రైతు మార్కెట్‌కు 6 బస్తాల ధాన్యం (ఆర్ఎన్ఆర్ పాతరకం) అమ్మకానికి తీసుకురాగా, క్వింటాకు రూ.2,911 చెల్లించారు. మద్దతు ధర రూ.2,060 ఉండగా, మద్దతుకు మించే ధర రావడం విశేషం. శుక్రవారం మార్కెట్‌కు 1,182 బస్తాల ధాన్యం అమ్మకానికి రాగా, క్వింటాకు గరిష్ఠ ధర రూ.2,911 పలకగా, కనిష్ఠ ధర రూ.1,809 పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

జిల్లా వార్తలు

సీపీపీ జీఎంగా బాధ్యతల స్వీకరణ



జక్కం రమేశ్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్పొరేట్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ (సీపీపీ) జీఎంగా జక్కం రమేశ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కొత్తగూడెం ఏరియా జీఎంగా పనిచేస్తున్న ఆయన ఇటీవలే సీపీపీ జీఎంగా నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరణ తర్వాత ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది నిర్దేశించిన 75 మిలియన్ టన్నుల లక్ష్య సాధనకు సీఎండీ సూచనల మేరకు కృషి చేస్తానని తెలిపారు. అలాగే, వీకే–7 ఓసీ, కోయగూడెం–3 ఓసీ అనుమతులకు పాటుపడతానని చెప్పారు.

ఔట్ సోర్సింగ్ అభ్యర్థుల మెరిట్ జాబితా సిద్ధం

భద్రాచలం: ప్రస్తుత విద్యాసంవత్సరానికి గాను ఖమ్మం రీజియన్‌లోని గిరిజన గురుకులాలు, ఏకలవ్య మోడల్ గిరిజన విద్యాలయాల్లో వివిధ పనుల నిమిత్తం ఔట్ సోర్సింగ్ విధానంలో నియామకాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల మెరిట్ జాబితా విడుదల చేశారు. ఈ విషయాన్ని భద్రాచలం ఐటీడీఏ పీఓ గౌతం పొట్రు ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 20వ తేదీ నుంచి 26వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించగా, తాత్కాలిక మెరిట్ జాబితా రూపొందించామని పేర్కొన్నారు. ఈ జాబితాపై అభ్యంతరాలు ఉన్న వారు ఖమ్మం రీజియన్ ప్రాంతీయ సమన్వయ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

యూపీఎస్సీ సీ-శాట్ శిక్షణకు వచ్చేనెల 9న ప్రవేశపరీక్ష

ఖమ్మంమయూరిసెంటర్: ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యాన హైదరాబాద్‌లో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సివిల్ సర్వీస్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (యూపీఎస్సీ సీ–శాట్) శిక్షణ ఇవ్వనున్నారు. అభ్యర్థులకు వచ్చేనెల 9న ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్లు ఎస్సీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ తెలిపారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, పీహెచ్‌సీ నిరుద్యోగుల్లో డిగ్రీ, ప్రొఫెషనల్ డిగ్రీ ఉత్తీర్ణులైన వారు శిక్షణ కోసం వచ్చే 2వ తేదీలోగా టీఎస్ స్టడీ సర్కిల్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారులకు హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్ జిల్లా కేంద్రాల్లో పరీక్ష నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తామని, పూర్తి వివరాల కోసం 98484 94290 నంబర్‌లో సంప్రదించాలని డీడీ సూచించారు.

లాభాల బాట పట్టిన డీసీసీబీ

- 123వ మహాజన సభలో చైర్మన్ నాగభూషణం
- 2022–23 వార్షిక నివేదికకు ఆమోదం



నివేదిక ప్రవేశపెడుతున్న సీఈఓ వీరబాబు, వేదికపై చైర్మన్ నాగభూషణం తదితరులు

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) లాభాల బాటలో పురోగమిస్తోందని చైర్మన్ కూరాకుల నాగభూషణం వెల్లడించారు. ఖమ్మంలోని ఓ హోటల్‌లో చైర్మన్ అధ్యక్షతన బ్యాంకు 123వ మహాజన సభ శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022–23 ఆర్థిక సంవత్సరంలో పాలకవర్గ సభ్యులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, ఉద్యోగుల సహకారంతో బ్యాంకు సుమారు రూ.20 కోట్ల లాభాలను ఆర్జించిందని తెలిపారు. అనంతరం మహాజన సభ అంశాలను బ్యాంకు సీఈఓ అట్లూరి వీరబాబు వెల్లడించారు. గత ఏడాది బ్యాంకు రూ.20 కోట్ల లాభాలు గడించగా, నికర లాభం రూ.1.64 కోట్లుగా ఉందని పేర్కొన్నా రు. ఇక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో నిర్వహిస్తున్న బహుళ సేవల కేంద్రాల నిర్వహణ పథకాన్ని మరో మూడేళ్లు పొడిగిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని సభ ముందుంచారు. పీఏసీఎస్ ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీ, వేతనాల చెల్లింపు, పీఏసీఎస్‌ల అధ్యక్షుల గౌరవ వేతనాల చెల్లింపునకు ఏకగ్రీవ ఆమోదం పొందారు. బ్యాంకు ఉపాధ్యక్షుడు దొండపాటి వెంకటేశ్వరరావు, డీసీఎంఎస్ చైర్మన్, వైస్ చైర్మన్లు రాయల శేషగిరిరావు, కొత్వాల శ్రీనివాసరావు, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల సహకార అధికారులు ఎ.విజయకుమారి, ఎస్.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో లేరనే 'మువ్వా'పై కక్ష సాధింపు



మాట్లాడుతున్న డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య

బీఆర్ఎస్ పార్టీలో లేరనే దురుద్దేశంతో డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబుపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని బ్యాంకు డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య ఆరోపించారు. మహాజన సభలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పాలకవర్గం బ్యాంకు ప్రతిష్ఠను దెబ్బతీస్తోందని తెలిపారు. విజయ్‌బాబు చైర్మన్‌గా ఉన్న కాలంలో తీసుకున్న నిర్ణయాలన్నీ బోర్డు తీర్మానంతో జరగగా, వీటిని పక్కన బెట్టి కొందరికి అక్రమ పద్ధతిలో రుణాలు ఇచ్చారని కేసులు బనాయించారని పేర్కొన్నారు. రుణాలు అందించే విషయంలో ధ్రువీకరణ పత్రాల పరిశీలన బాధ్యత అధికారులపై ఉండగా.. అలా కాకుండా విజయ్‌బాబుపై నెట్టే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. దీంతో విజయ్‌బాబు కోర్టు నుంచి స్టే తెచ్చుకున్నారని పేర్కొన్నారు.

పోషకాహార లోపాన్ని అధిగమిస్తేనే ఆరోగ్యం



కొండరెడ్లతో మాట్లాడుతున్న డీడీ శ్రీనివాసరావు

జాతీయ పోషకాహార సంస్థ డీడీ శ్రీనివాసరావు

అశ్వారావుపేటరూరల్: పోషకాహార లోపాన్ని అధిగమించగలిగితేనే సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందని జాతీయ పోషకాహార సంస్థ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జె.శ్రీనివాసరావు తెలిపారు. గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ దత్తత తీసుకున్న అశ్వారావుపేట మండలం గోగులపూడిలో శుక్రవారం ఆయన రెడ్‌క్రాస్ సొసైటీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ఎల్ కాంతారావుతో కలిసి పర్యటించారు. మిగతా జనాభాతో పోలిస్తే కొండరెడ్లలో పోషకాహార లోపం అధికంగా ఉన్నందున రాష్ట్రంలోని నాగర్‌కర్నూల్, భద్రాద్రి కొత్తగూడెం, ఆదిలాబాద్ జిల్లాల్లోని ఆరు గ్రామాలను ఎంపిక చేసి అధ్యయనం చేస్తున్నట్లు తెలిపారు. గిరిజనులు సహజంగా అటవీ ప్రాంతాల్లో లభించే ఫలాలు, ఇప్పపువ్వును ఇష్టపడుతున్నందున ఇప్పపువ్వులతో చేయించిన లడ్డూలు సమకూర్చనున్నట్లు తెలిపారు. సర్పంచ్ కంగాల భూలక్ష్మి, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు జి.రాజారెడ్డి, వై.సూర్యనారాయణ, డాక్టర్ భానుప్రసాద్, బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జ్ ఎ.రవికుమార్, వైద్యులు టి.మధులిక, దురమ్మతో పాటు జి.మంగిరెడ్డి, బాబురెడ్డి పాల్గొన్నారు.

జీసీసీ గోదాంలో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు



గోదాంలో తనిఖీ చేస్తున్న అధికారులు

పాల్వంచరూరల్: పాల్వంచలోని గిరిజన సహకార సంస్థ (జీసీసీ)కు సంబంధించి సివిల్ సప్లయిస్ గోదాంలో శుక్రవారం హైదరాబాద్ నుంచి వచ్చిన టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు చేపట్టింది. ఈ సందర్భంగా బియ్యం స్టాక్‌ను తనిఖీ చేయడమే కాక రికార్డులు పరిశీలించి నమోదు చేసుకున్నారు. బృందంలో తహసీల్దార్ కమల్‌పాషా, ఎస్ఐలు చారి, గోపాల్‌రావు ఉండగా, జీసీసీ మేనేజర్ లక్ష్మాజీ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ నిధులతోనే సమగ్రాభివృద్ధి



కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

ఖమ్మంరూరల్: కేంద్ర ప్రభుత్వ నిధులతో అన్ని రంగాల్లో అభివృద్ధికి అడుగులు పడుతున్నాయని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఖమ్మం రూరల్ మండలం గుర్రాలపాడులో శుక్రవారం ఆయన ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలతో రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అభివృద్ధి పనులకు నరేంద్రమోదీ ప్రభుత్వం పెద్దమొత్తంలో నిధులు విడుదల చేసిందని తెలిపారు. ఇందులో భాగంగానే సూర్యాపేట–ఖమ్మం, ఖమ్మం–దేవరపల్లి, కురవి–కోదాడ రహదారి, జిల్లా మీదుగా వెళ్లే రాయ్‌పూర్, ఇబ్రహీంపట్నం రహదారులకు నిధులు వచ్చాయని చెప్పారు. అలాగే, సత్తుపల్లి రైల్వేమార్గం, బుగ్గపాడులో ఫుడ్‌పార్క్ నిర్మాణం సైతం కేంద్ర ప్రభుత్వ నిధులతోనే జరుగుతున్నాయని తెలిపారు. ఇదే సమయాన దక్షిణ అయోధ్యగా పిలవబడే భద్రాచలానికి సీఎం కేసీఆర్ రూపాయి కూడా కేటాయించడం లేదని ఆరోపించారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని శ్రీధర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నూకల రాంమోహన్‌రెడ్డి, అనంత ఉపేందర్‌గౌడ్, మధు, ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్యాసింజర్ రైళ్ల రద్దు పొడిగింపు

ఖమ్మంమామిళ్లగూడెం: ట్రాక్ మరమ్మతుల కారణంగా పలు ప్యాసింజర్ రైళ్లను రద్దు చేయగా, ఈ నిర్ణయం మరికొద్ది రోజులు అమల్లో ఉంటుందని ఖమ్మం సీసీఐ జాఫర్ తెలిపారు. తొలుత ఈ నెల 19 నుంచి 25 వరకు మాత్రమే రైళ్లు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. కానీ, పనులు పూర్తికాకపోవడంతో జూలై 2వ తేదీ వరకు రైళ్లు నడవవని తెలిపారు. ఇందులో విజయవాడ నుంచి ఖమ్మం మీదుగా నడిచే డోర్నకల్–విజయవాడ (07755), విజయవాడ–డోర్నకల్ (07756), భద్రాచలంరోడ్–విజయవాడ (07278), విజయవాడ–భద్రాచలంరోడ్ ప్యాసింజర్(07279) ఉన్నందున ప్రయాణికులు సహకరించాలని కోరారు.

ప్రశ్నించే వారిపై 'ఉపా'తో బెదిరింపులు

- దేశాన్ని కార్పొరేట్లకు తాకట్టు పెట్టిన మోదీ
- ఎల్లన్న వర్ధంతి సభలో ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి రంగారావు



వర్ధంతి సభలో మాట్లాడుతున్న పోటు రంగారావు

ఇల్లెందు: దేశం, రాష్ట్రంలో ప్రజాస్వామిక శక్తులు, ప్రశ్నించే వారిని పాశవికంగా అణచివేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపా చట్టాలు మోపుతున్నారని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు మండిపడ్డారు. ఇల్లెందులోని కలాసీబస్తీలో చంద్ర కృష్ణమూర్తి(ఎల్లన్న) 27వ వర్ధంతి సభను పార్టీ ఇల్లెందు డివిజన్ కార్యదర్శి నాయిని రాజు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సభలో పోటు రంగారావు మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్రమోదీ, రాష్ట్రంలోని కేసీఆర్ ప్రభుత్వాలు హామీలను అమలు చేయటంలో విఫలమయ్యాయని ఆరోపించారు. మోదీ ప్రభుత్వం మేకిన్ ఇండియా, స్వదేశీ నినాదం, భారత్ వెలిగి పోతోందంటూ మెరుపులు మెరిపించిచంగా.. ప్రభుత్వం రంగ సంస్థలను అమ్మేశారని తెలిపారు. దేశం, ప్రజా ఆస్తులను కార్పొరేట్లకు తాకట్టు పెట్టిన ఘనత మోదీకే దక్కుతుందని ఎద్దేవా చేశారు. అంతేకాక కులమతాల పేరిట ప్రజల్లో విద్వేషాలు పెంపొందిస్తున్నారని తెలిపారు. ఇక తెలంగాణలోనూ నైజాంను పోలిన విధంగా కేసీఆర్ పాలిస్తున్నాడని విమర్శించారు. కొన్ని పథకాలు ప్రవేశపెట్టినంత మాత్రాన ప్రజల బతుకులు తానే మార్చినట్లు చెప్పుకోవడం గర్హనీయమని పేర్కొన్నారు. ఒకనాడు తెలంగాణను వ్యతిరేకించిన వారే నేడు ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు అయ్యారని వివరించారు. కాగా, దేశంలో వచ్చిన యాంత్రికీకరణ, పట్టణీకరణ మార్పులకు అనుగుణంగా పార్టీ మారాల్సి ఉందని.. ఆ దిశగానే ప్రజాపంథా పయనిస్తోందని రంగారావు స్పష్టం చేశారు. తొలుత పార్టీ పతాకాన్ని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య ఎగురవేయగా, అమరుల చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. అలాగే, అరుణోదయ కళాకారుల ఆటపాటా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎల్లన్న సతీమణి, మాజీ జెడ్పీటీసీ చంద్ర అరుణ, రాష్ట్ర నాయకుడు రాయల చంద్రశేఖర్, భద్రాద్రి, ఖమ్మం జిల్లాల కార్యదర్శులు కిచ్చెల రంగయ్య, గోకినేపల్లి వెంకటేశ్వరరావుతో పాటు చిన్నచంద్రన్న, గండి యాదగిరి, మాచర్ల సత్యం, ముద్దాం భిక్షం, యాకూబ్‌షావలీ, కాంపాటి పృథ్వీ, ఈసం శంకర్, పూనెం కుమార్, డీవీబీ చారి, అజ్మీరా బిచ్చా, బుర్ర వెంకన్న తదితరులు పాల్గొన్నారు.